ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జనగామ
సోమవారం 8 జనవరి 2024



సంప్రదాయ పరిరక్షణకు 'ఆంధ్రజ్యోతి' పెద్దపీట..

- భోగ కైలాసం, శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్ అధినేత

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆంధ్రజ్యోతి ముందు నుంచీ పెద్దపీట వేస్తోందని ప్రముఖ వస్త్రవ్యాపారి, శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్స్ అధినేత భోగ కైలాసం అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలోనూ 'ఆంధ్రజ్యోతి' ముందుంటుందని కొనియాడారు. అవినీతిని వెలికి తీస్తూ పేదల పక్షాన ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దమ్మున్న పత్రికగా, ప్రజల గొంతుకగా నిలబడుతోందన్నారు. తెలుగింటి పండగ అయిన సంక్రాంతి సంబురాలను 'ఆంధ్రజ్యోతి' ముందుగానే నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందని అన్నారు.

అలరించిన రంగవల్లులు



జనగామ సెయింట్ పాల్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



ముగ్గుల పోటీలో మాట్లాడుతున్న కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- పోటీలను తిలకించిన కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య దంపతులు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్ అధినేత భోగ కైలాసం

జనగామ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఏటా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన పోటీలకు జనగామ సెయింట్ పాల్స్ హైస్కూల్ వేదికైంది. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన" రాష్ట్రస్థాయి స్పాన్సర్లుగా వ్యవహరించగా జనగామకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి, 'శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్స్' అధినేత భోగ కైలాసం లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. ఆదివారం జరిగిన పోటీలకు జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుంచి మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి ఒక్కొక్కరుగా రాగా వచ్చిన వారి పేర్లను నమోదు చేసుకొన్న తర్వాత ఉదయం 10.30 గంటలకు ముగ్గుల పోటీ ప్రారంభమైంది. 50 మందికి పైగా మహిళలు, యువతులు, బాలికలు పాల్గొని అందమైన రంగవల్లులు వేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడంతో పాటు సామాజిక అంశాలపై చైతన్యం కల్పించేలా మహిళలు వేసిన ముగ్గులు అలరించాయి. వృక్ష, నీటి సంరక్షణ, బాలికా సంరక్షణ, రైతు సంక్షేమానికి సంబంధించి చిత్రాలతో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, ఆయన సతీమణి వందన తిలకించారు. మహిళలతో కలిసి ముగ్గులు వేశారు. రెండు గంటల పాటు సాగిన పోటీలు 12.30 గంటలకు ముగిశాయి.



మొదటి బహుమతి విజేత అనితకు షీల్డ్ అందిస్తున్న శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్ అధినేత భోగ కైలాసం

న్యాయనిర్ణేతలుగా సెయింట్ పాల్స్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు పద్మ, రేఖ, రూప వ్యవహరించారు. ప్రథమ బహుమతి అంచూరి అనిత(స్టేషన్‌ఘన్‌పూర్), ద్వితీయ బహుమతి పెద్ది కుసుమ(జనగామ), తృతీయ బహుమతి బొట్ల సుమలత(జనగామ) దక్కించుకున్నారు. ప్రథమ బహుమతి కింద రూ.6000, ద్వితీయ బహుమతి కింద రూ. 4000, తృతీయ బహుమతి కింద రూ. 3000 చొప్పున అందించారు. అదే విధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరు కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు.

'ఆంధ్రజ్యోతి' చొరవ అభినందనీయం: కలెక్టర్

సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంలో భాగంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' తీసుకున్న చొరవ అభినందనీయమని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య కొనియాడారు. సంక్రాంతి పండగ, సంక్రాంతి ముగ్గుల విశిష్టతను అందించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీని నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి ఆయన అభినందనలు

మిగతా 6వ పేజీలో



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు
విజేత అంచూరి అనిత (స్టేషన్‌ఘన్‌పూర్)



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు
విజేత పెద్ది కుసుమ (జనగామ)



తృతీయ బహుమతి పొందిన ముగ్గు
విజేత బొట్ల సుమలత (జనగామ)

ఆటలతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి • గూడూరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

పాలకుర్తి, జనవరి 7 : ఆటలపై మక్కువ పెంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం పాలకుర్తి మండలం గూడూరులో యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్యాట్ పట్టి క్రీడలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, సర్పంచు మంద కొంరయ్య, మాజీ ఎంపీటీసీ బెల్లి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కిక్కిరిసిన మేడారం

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 7: తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు ముందస్తు మొక్కులు ప్రారంభమయ్యాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పూలు, పండ్లు, చీరె, సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించారు. ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని అందరినీ చల్లగా చూడాలని తల్లులను వేడుకున్నారు.

మొక్కులు చెల్లించుకున్న బండ్ల గణేష్

మేడారం సమ్మక్క-సారలమ్మలను సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. తెలంగాణ లో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వనదేవతలను కోరుకున్నానని, తన ఆకాంక్ష నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నానని తెలిపారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



నిలువెత్తు బంగారు (బెల్లం)తో వనదేవతల దర్శనం కోసం వస్తున్న బండ్ల గణేష్

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, జనవరి 7 : వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమయాత్తం కావాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని నిరుత్సాహపడకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు కష్టపడి పని చేయాలని కోరారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీకి మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. కార్యకర్తలు ఇబ్బందులకు గురైతే తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పాలకుర్తి మండలంలోని తొర్రూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు పులి ఎలేంద్ర భర్త యాదగిరి గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమావేశంలో మోహన్‌గాంధీ నాయక్, మండల అధ్యక్షుడు నవీన్, సర్పంచు యాకాంతరావు, మాచెర్ల ఎల్లయ్య జడ్పీకోఆప్షన్ సభ్యుడు మదార్ పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

నేడు జనగామలో ఎముకల వైద్య శిబిరం

జనగామ టౌన్, జనవరి 7: లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో సోమవారం ఎముకల పరీక్షలకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి, జోన్ చైర్మన్ జైన రమేశ్ ప్రకటించారు. జనగామ పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షల ద్వారా ఎముకల గట్టితనం, సాంద్రతను తెలుసుకుని మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కమనీయం.. రమణీయం..

వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- తిలకించి పులకించిన భక్తజనం
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- హాజరైన బీసీ, రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రముఖులు

చేర్యాల, జనవరి7: ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, వీరశైవపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లిఖార్జున స్వామి కేతలమ్మ, మేడలాదేవీలను వివాహమాడారు. సనాతన వీరశైవాగమశాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం రోజును పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై న భూతో నభవిష్యత్తు అన్న చందంగా కమనీయంగా, రమణీయంగా కైంకర్యం నిర్వహించారు.

కల్యాణ క్రతువు..

వీరశైవార్చకులు మల్లికార్జునస్వామి, కేతమ్మ, మేడలాదేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మహిళల కోలోటాల నడుమ భాజాభజంత్రీల మధ్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వరుడు మల్లి ఖార్జునస్వామి తరఫున కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు, అమ్మవార్లు గొల్ల కేతమ్మ, మేడలాదేవీల తరఫున కన్యాదాతలుగా మహదేవుని మనోహర్ దంపతులు వ్యవహరించారు. వేదికపై పట్టు వస్త్రాలతో ధగధగ లాడుతున్న దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణ నిర్వహణ తీరు, విశేషాలను డాక్టర్ మహంతయ్య, షశిభూషణ సిద్ధాంతి చేసిన వ్యాఖ్యానం భక్తులను అలరించింది. మల్లన్నాకీ జై అన్న భక్తులు చేసిన జయజయ ధ్వానాలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి.

పట్టువస్త్రాలు అందించిన మంత్రి కొండా సురేఖ

రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబాలు అందచేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి కల్యాణమండపానికి తీసుకువచ్చారు. మాంగళ్యధారణ అనంతరం స్వామివారిని దర్శించుకుని మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. మంత్రి కొండా సురేఖ కుటుంబసభ్యులతో కలిసి పట్నంవేసి మొక్కుతీర్చుకున్నారు.



దేవతామూర్తులకు తలంబ్రాలు పోస్తున్న వీరశైవార్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

సంప్రదాయబద్ధంగా దృష్టికుంభం

తెల్లవారుజామున 4.30గంటలకు గర్భాలయ మండపంలోని వీరభద్రుడికి బలిహరణ చేసి దృష్టికుంభాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవార్చకులు అన్నంరాశులపై గుమ్మడికాయలు నెలకొల్పి దండకాలతో హోరెత్తించిన అనంతరం గుమ్మడికాయను బలిఇచ్చి స్వామివారి తొలిదర్శనాన్ని ప్రారంభించారు. మల్లన్నకు చత్రకన్ను అమర్చి శతరుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.

గంటన్నరపాటు కల్యాణం ఆలస్యం..

మల్లన్న కల్యాణం ఉదయం 10:45 గంటలకు జరగాల్సి ఉండగా, మధ్యాహ్నం 12:28గంటలకు మాంగళ్యధారణ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ముందే వచ్చినా మంత్రి కొండా సురేఖ ఆలస్యంగా రావడంతో నిర్ణీత సమయానికన్నా గంటన్నరపాటు ఆలస్యమడంతో భక్తులు విస్మయం వ్యక్తంచేశారు.



హాజరైన మంత్రులు
కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



తాటిచెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తాటి చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హసన్‌పర్తి శివారులో 19 మందికి గాయాలు



గాయపడ్డ ప్రయాణికులను 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి, జనవరి 7: అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు తాటి చెట్టును ఢీ కొన్న సంఘటన ఆదివారం రాత్రి హసన్‌పర్తి శివారులో జరిగింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళుతోంది. బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు హసన్‌పర్తి శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయింది. అదుపు తప్పిన బస్సు రోడ్డు.. పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీ కొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డవారికి ప్రథమ చికిత్స చేసి, 108 ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంగ్లీష్‌లో కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకురాలు ఎస్.కవితకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కవితకు డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'థీమ్ ఆఫ్ డయాస్ పోరా ఇన్ ది నవెల్స్ ఆఫ్ అనిత రావ్ బాదమీ' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ఇంగ్లీష్ విభాగం ప్రొఫెసర్ వి. శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తారు.

ప్రభుత్వ పాలన శాస్త్రంలో శంకర్‌కు..

కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్రం పరిశోధకుడు నిమ్మనగోటి. శంకర్‌కు డాక్టరేట్ లభించింది. 'ఇంప్లిమేంటేషన్ ఆఫ్ వెల్ఫేర్ మేజర్స్ అండ్ రెహబిలిటేషన్ స్కీమ్స్ ఫర్ విజుల్లీ డిస్సాబ్లెడ్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ప్రభుత్వ పాలనశాస్త్రం ప్రొఫెసర్ పింగళి నర్సింహరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరడ గ్రామానికి చెందిన శంకర్ కేయూలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 7: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని లష్కర్ సింగారంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మస్సి తండాకు చెందిన బానోతు బాలాజీ హనుమకొండ లష్కర్ సింగారంలో ఉంటూ దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం లష్కర్ సింగారంలోని ఇంటి ముందు పార్కింగ్ చేసి బయటకు వెళ్లి వచ్చాడు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



దామెర మండల కేద్రంలో వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్ డీలర్ (ఫైల్)

ఈ- కేవైసీకి నెలాఖరు గడువు

రేషన్ దుకాణాలకు పరుగులు.. కొనసాగుతున్న ప్రక్రియ

హనుమకొండ రూరల్, జనవరి 7: రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులకు ఈ-కేవైసీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రేషన్‌కార్డు లబ్ధిదారులందరి వేలిముద్రలు సేకరించాలని రేషన్ డీలర్లకు ఆదేశాలు రావడంతో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. రేషన్‌కార్డు ద్వారా పొందే బియ్యం దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వాల దృష్టికి రావడంతో ఈ కేవైసీ తప్పనిసరి చేస్తూ ఆదేశించినట్లు తెలుస్తోంది. రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరు ఈ-పాస్ యంత్రాల ద్వారా వేలిముద్రలు డీలర్లు సేకరిస్తున్నారు. ఈ-కేవైసీ చేసుకోకుంటే బియ్యం ఇవ్వరనే వదంతులు వ్యాపించడంతో పెద్దఎత్తున రేషన్ దుకాణాలకు పరుగులు పెట్టారు. రేషన్ డీలర్లు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 73శాతం ఈ- కేవైసీ పూర్తయినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

రేషన్ దుకాణాలకు పరుగులు

ఈ-కేవైసీ ఈనెల 31వ తేదీతో ముగుస్తుండటంతో ప్రజలు రేషన్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే చాలా మంది వేలిముద్రలు ఇవ్వగా.. ఇంకా ఇవ్వని వారు గడువు సమీపిస్తుండటంతో ఎలాగైనా ఈ-కేవైసీ చేయించుకోవాలనే ఉద్దేశంతో రేషన్‌దుకాణాల ముందు వేచి ఉంటున్నారు. రేషన్ కార్డుల్లోని చిన్నారులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో ఆధార్ నమోదు సెంటర్లకు పరుగులు తీస్తున్నారు.

ఈ- కేవైసీ 73శాతం పూర్తి

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 414 రేషన్ దుకాణాలు ఉండగా రేషన్ కార్డులు 2,28,143 ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,16,767, అంత్యోదయ కార్డులు 11352, అన్నపూర్ణ కార్డులు 24 ఉన్నాయి. మొత్తం 6,75,550 లబ్దిదారులు ఉండగా ఇందులో ఇప్పటి వరకు 4,92,693 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,82,857 మంది రేషన్ కార్డుదారులు ఈ- కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 73శాతం మంది ఈ- కేవైసీ చేయించుకున్నారు. మిగతావారు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి :
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.వసంతలక్ష్మీ

జిల్లాలోని రేషన్ కార్డుదారులు విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలి. పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ఇవ్వడం జరిగింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సమీపంలోని రేషన్ దుకాణాలలో వేలిముద్రలు (ఈ-కేవైసీ) ఇవ్వాలి. ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేసుకోని లబ్దిదారులు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.

కేయూ ఉద్యోగి మృతిపై ఉద్రిక్తత


మధుసూదన్ (ఫైల్)

- బిల్లులు రాలేదని ఒత్తిడితో మృతిచెందాడని బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని వర్సిటీకి తరలించి నిరసన.. వీసీ హామీతో విరమణ

కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి మధుసూదన్ (49) గుండెపోటులో ఆదివారం మృతి చెందారు. రెండు రోజుల కిందట మధుసూదన్‌కు గుండెపోటుకు గురికాగా, హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగానే పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో ప్రొఫెసర్ పీ.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసన్ ఎస్. వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ మామిడాల ఇస్తారీలు హనుమకొండలోని పాత ఆర్డీవో ఆఫీస్ ప్రాంతంలో ఉన్న మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉద్రిక్తత

మధుసూదన్ వర్సిటీలో ఉద్యోగం చేస్తూనే ఇటీవల కేయూ న్యాక్ పనుల్లో భాగంగా వర్సిటీకి కావాల్సిన ఫ్లెక్సీలు, ఇతర పనులు చేశారు. ఆయా బిల్లులు సుమారు రూ.20లక్షల మేరకు వర్సిటీ మధుసూదన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ వర్సిటీ అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని మానసిక ఆందోళనలతోనే మధుసూదన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మధుసూదన్ ఇంటికి వచ్చిన వర్సిటీ ఉన్నతాధికారులు ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. వర్సిటీ నుంచి మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులను వెంటనే ఇప్పిస్తామని హామీఇచ్చారు. అయితే కుటుంబసభ్యులు తమకు స్పష్టమైన లిఖిత పూర్వకమైన హామీ కావాలని వర్సిటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకటి., రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినా సంతృప్తి చెందక మధుసూదన్ మృతదేహాన్ని వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉంచి నిరసన ఆందోళన చేసేందుకు వర్సిటీకి తరలించారు. అయితే పోలీసులు వెంటనే అప్రమత్తమై మృతదేహాన్ని వర్సిటీలోనికి తీసుకురాకుండా మొదటి గేటువద్ద అడ్డుకున్నారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులతో వాగ్వాదం జరిగింది. చివరకు మధుసూదన్ మృతదేహంతో పరిపాలన భవనం ఎదుట నిరసనలకు దిగారు. దీంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులన్ని వెంటనే చెల్లిస్తామని ఫోన్‌లో కుటుంబసభ్యులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధుసూదన్ వైద్య ఖర్చుల కోసం ఇటీవల రూ.3 లక్షలు చెల్లించామని, మిగతా డబ్బులు సోమవారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సందర్శించిన తోటి ఉద్యోగులు

మధుసూదన్ మృతి విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు, వర్సిటీ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు భారీగా తరలి వచ్చారు. అనంతరం పోచమ్మకుంటలోని హిందూ స్మశాన వాటికలో మధుసూదన్ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడికి భార్య కోమల, కూతురు మనస్విని, కొడుకు తేజలున్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వర్సిటీ అధికారులు తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ మల్లారెడ్డి తదితరులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీలో ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా పోలీసు అధికారులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది

అలరించిన రంగవల్లులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయవంతంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు



మహబూబాబాద్‌లో కెనరా బ్యాంక్ మేనేజర్ శోభన్‌కు మెమోంటో అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్‌లో లోగో ముగ్గులు వేసిన చిన్నారి సరెడ్డి సాయి స్ఫూర్తికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


జనగామలో ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆయన సతీమణి


జనగామలో లోకల్ స్పాన్సర్ 'శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్' అధినేత భోగ కైలాసంను సత్కరిస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొన్న చిన్నారులకు డిక్షనరీలను అందచేస్తున్న విక్రమ్ పబ్లిషర్ ప్రతినిధి శ్రీనివాస్


హనుమకొండలోని ముగ్గులో పోటీలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న చిన్నారులు


హనుమకొండలో మాట్లాడుతున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ సుజాత


ములుగులో జరిగిన ముగ్గుల పోటీల సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి సీతక్క


ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు

అలరించిన రంగవల్లులు

3వ పేజీ తరువాయి

తెలిపారు. రైతులు తాము పండించిన పంటలో ప్రకృతిలోని జీవరాశికి కొంత అర్పించే పండగ సంక్రాంతి అని వివరించారు. భవిష్యత్తులోనూ పాడి పంటలతో విలసిల్లాలని రైతులు కోరుకుంటూ సంక్రాంతిని జరుపుకుంటారన్నారు. రైతులందరూ ఎల్లప్పుడూ క్షేమంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అదే విధంగా జిల్లాలోని అన్ని వర్గాల వారు సంక్రాంతి పండగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అద్భుతమైన థీమ్‌తో ముగ్గులు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ హైస్కూల్ వైస్ ప్రిన్సిపాల్ దేవకుమార్, ఆంధ్రజ్యోతి జనగామ స్టాఫ్ రిపోర్టర్ వంగ శ్రీకాంత్‌రెడ్డి, జనగామ అడ్వర్టజ్‌మెంట్ ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి, సర్క్యులేషన్ ఇన్‌చార్జి రమేశ్, రిపోర్టర్లు రేగు యాదగిరి, పిండిపోలు నాగదక్షిణామూర్తి, మేకల రవీందర్, చిట్యాల యాకయ్య, మాధంశెట్టి వేణుమాధవ్, అల్లిబిల్లి ప్రసాద్, బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, తౌటి గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ దృశ్యమాలిక



కలెక్టర్ దంపతులతో పాటు అతిథులను సత్కరిస్తున్న 'ఆంధ్రజ్యోతి' బృందం



తృతీయ బహుమతి అందుకుంటున్న సుమలత



ద్వితీయ బహుమతి అందుకుంటున్న పెద్ది కుసుమ



ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ లోగో ముగ్గు వేస్తున్న యువతి



మహిళతో కలిసి ముగ్గు వేస్తున్న కలెక్టర్ సతీమణి వందన





ముగ్గులు వేస్తున్న మహిళలు





ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కలెక్టర్ దంపతులతో 'ఆంధ్రజ్యోతి' బృందం

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

- ఊరూరా ర్యాలీ నిర్వహించిన భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 7: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఆదివారం అయోధ్య రాముడి అక్షింతలను రెండో రోజు పంపిణీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ తిరుమల నాథస్వామి, శివాలయం నుంచి రైల్వే గేటు వరకు, శివునిపల్లి శ్రీ వేంకటేశ్వరాలయం, నగరేశ్వరాలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ రాముని డీజే పాటలతో, జై శ్రీరాం నినాదాలతో ర్యాలీలు చేపట్టారు. ర్యాలీకి ప్రజలు భక్తితో మంగళ హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఏబీవీపీ, భజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులతో పాటు జిల్లా సంయోజక్ మంచాల రవీందర్, ఘన్‌పూర్ ఖండ సంయోజక్ డాక్టర్ హేమంత్‌రాజు, ఆలయ కమిటీల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం మండల కేంద్రంలో ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి మండంలోని వివిధ గ్రామాలకు చెందిన సీతారామ భజనమండలి సభ్యులు శ్రీరామ నామస్మరణ కీర్తనలను భక్తిభావంతో ఆలపిస్తుండగా ఎంపీటీసీ పేర్నె ఉషరవి తదితరులు వాడవాడల తిరుగుతూ ఇంటింటికీ అందజేశారు. ఈ నెల 22న అయోధ్యలోని రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతున్నందున వీటిని కుటుంబంలోని ప్రతీ ఒక్కరు ఆ రోజున తలపై చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్, ఆర్ఎస్ఎస్ మండల ఖండ కార్యవాహ పడకంటి రవిందర్, అంబటి బాలరాజు, లింగంపల్లి కిషన్, మంతెన ఉప్పలయ్య, ద్యావర రాజు, మల్కాపురం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని కూనూరులో ఆదివారం అయోధ్య రామ మందిర అక్షింతలను పంపిణీ చేశారు. స్థానిక శివాలయంలో వాటికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేసిన అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు రాములోరి అక్షింతల కలశాలతో గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాలు, భక్తుల శ్రీరామ నామ జయ జయధ్వానాలతో పుర వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ శిరబోయిన సంధ్య శ్రీనివాస్, కాటం మల్లారెడ్డి, గడ్డం యాకయ్య, నెల్లుట్ల అజయ్‌కుమార్, గడ్డం ధనుంజయ్, ఈగ కృష్ణమూర్తి, కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, ఏకాంతం, రాంరెడ్డి, తదితరులు, అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

జనగామ టౌన్: అయోధ్య రాముడి అక్షింతలను ఆదివారం జనగామ మండలంలోని చీటకోడూరు గ్రామంలో వితరణ చేశారు. గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామ కమిటీ ఛైర్మన్ ఎల్లబోయిన రాజేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో అక్షింతలను అందజేశారు. ఇక్కడి నుంచి గ్రామస్థులకు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్త దీపక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొత్త కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీలత, ఆలయ పురోహితులు కృష్ణమాచారి, బత్తిని నర్సయ్యగౌడ్, వెంకటేశ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: అయోధ్యలో రామమందిర నిర్మాణంతో 500 ఏళ్ల హిందువుల కల నెరవేరినట్టేనని రామమందిర తీర్థక్షేత్ర ట్రస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యులు దొంతుల శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని కట్కూరు గ్రామంలో రాంలాల మందిరంలో ప్రాణప్రతిష్ఠ పూజిత అంక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బావండ్ల కృష్ణంరాజు, ముసిని రాజుగౌడ్, శ్రీశైలంగౌడ్, గుంటిపల్లి సత్యనారాయణ, ముసిని వేణుగోపాల్‌గౌడ్, పోలోజు రాంబ్రహ్మం, కనకచారి, బుచ్చయాచారి, విదేయ్, గుడుగుల సత్తయ్య, ఎర్ర కనకయ్య, కృష్ణ, రాంచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.



శివునిపల్లిలో అయోధ్య అక్షింతలతో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



కూనూరులో అక్షింతలను తీసుకెళ్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

సంపత్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

చిలుపూర్, డిసెంబరు 7: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దివంగత జడ్పీ ఛైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. నెల రోజుల క్రితం గుండెపోటు కారణంగా మృతిచెందిన సంపత్‌రెడ్డి కుటుంబాన్ని ఆదివారం హన్మకొండలో సందర్శించారు. పాగాల చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి సుజాతతో పాటు, ఇతర ఇతర కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సంపత్‌రెడ్డి 14 ఏళ్ళ పాటు రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారని, నియమ, నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోవడం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన వెంట పల్లా యువ సేన వ్యవస్థాపకుడు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, నారగోని రవిచంద్ర, వీరేందర్ రెడ్డి, ఇమ్మడి శ్రీనివాసరెడ్డి, సందీప్, ఎమ్డీ గౌస్, సేవెల్లి మధు, ఉల్లెంగుల సందీప్, తోట రావన్, నోముల సాయిచరన్ రెడ్డి పాల్గొన్నారు.



హనుమకొండలో సంపత్‌రెడ్డి సతీమణి సుజాతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్‌లో పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఉమ్మడి జిల్లా పశుపోషకుల సంఘం మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తరిగొప్పుల జడ్పీటీసీ ముద్దసాని పద్మజారెడ్డితో కలిసి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

బాధిత కుటుంబానికి రాజయ్య పరామర్శ



గుర్రం నర్సింహ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి7: మండలంలోని విశ్వనాథపురం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం నర్సింహ ఇటీవల మృతిచెందగా ఆదివారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నర్సింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కోసం నర్సింహ చేసిన సేవలను కొనియాడారు. నర్సింహ కుటుంబానికి తాను అండగా ఉంటానన్నారు. తక్షణ సాయంగా రూ.40వేలతో పాటుగా 150కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆర్థిక సాయంలో ఇద్దరు కూతుర్ల పేరిట చెరో రూ.20వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీస్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మారపాక రవి, నాయకులు ఆకుల కుమార్, మాచర్ల గణేశ్, సర్పంచ్ అనుముల మల్లేశ్, గుండె మల్లేశ్, శంకర్, శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ను పరామర్శించిన సాంబయ్య..

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రంగరాయిగూడెం డీలర్ వీరేశం తల్లి దక్షమ్మ ఆదివారం మృతిచెందగా టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాట సాంబయ్య సంతాపం ప్రకటించారు. వీరేశంను పరామర్శించి దక్షమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. ఆయనతో పాటు నాయకులు కత్తుల కట్టయ్య, సంపత్‌రెడ్డి, వెంకన్న, లింగారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నేలపోగుల ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య, మహేశ్ యాదవ్, శ్రవణ్‌కుమార్ తదితరులు నివాళి అర్పించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మెడల్స్ ప్రదానం చేస్తున్న ఎస్సై శ్వేత

జనగామ టౌన్, జనవరి 7: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జనగామ పట్టణ ఎస్ఐ మాచర్ల శ్వేత సూచించారు. ఆదివారం జనగామలోని వైష్ణవి పాఠశాలలో నిర్వహించిన తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తైక్వాండో నేర్చుకుంటే ఆరోగ్యంగా, దృఢంగా ఉంటారని చెప్పారు. అమ్మాయిలు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సై పలు కరాటే విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. అనంతరం తైక్వాండోలో ప్రతిభ చాటిన వారికి గోల్డ్, సిల్వర్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చాంపియన్ షిప్ నిర్వాహకులు ఎండీ.అబ్బాస్, మంగళంపల్లి రాజు, రెడ్డి రత్నాకర్‌రెడ్డి, వెంపటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి7: స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ-జిట్టగూడెం గ్రామాల శివారులో ఫిబ్రవరి-21 నుంచి 24 వరకు జరిగే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరను రాజకీయాలకతీతంగా విజయవంతం చేయాలని వైస్‌ఎంపీపీ చల్ల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరుగుతున్న జాతర పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గద్దెల పరిసరాల్లో ఉన్న రైతులు జాతర పూర్తయ్యేవరకు పంటలను సాగు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారపాక రాములు, మార్గ శ్రీనివాస్, సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న వైస్‌ఎంపీపీ సుధీర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు



కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

బచ్చన్నపేట, జనవరి 7: సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొన్నె గ్రామ సర్పంచ్ వేముల వెంకట్ గౌడ్ ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో సిద్దిపేట జిల్లా చేర్యాలలోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయనతో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెవిటి ఆనందం కాంగ్రెస్‌లో చేరారు. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీలో గత కొంత కాలంగా గ్రూపు రాజకీయాలు సాగుతున్నందున ఇమడలేకే సర్పంచ్ పార్టీ ఫిరాయించినట్టు తెలుస్తోంది. కాగా ఇదే దారిలో మరికొంత మంది ప్రజాప్రతినిధులు ఉన్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాను కృషి చేయనున్నట్టు వెంకట్‌గౌడ్ తెలిపారు. కాగా పార్టీలోకి వచ్చేవారు, గతం నుంచి పనిచేస్తున్నవారు గ్రామాలలో సమన్వయంతో పని చేసి ఎంపీతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించేలా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, నిడిగొండ శ్రీనివాస్, జంగిటి విద్యానాథ్, జంగిటి నరేష్, నూకల బాల్‌రెడ్డి, జ్యోతిభాస్కర్, గార్లపాటి మహిపాల్ రెడ్డి, దిడిగ రమేశ్, బందారపు క్రాంతి, సందెల రాము, నల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాగా బచ్చన్నపేటలో పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

మంత్రి పొన్నంను కలిసిన కొమ్మూరి

జనగామ టౌన్, జనవరి 7: సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి దేవస్థానంలో మల్లన్న కల్యాణానికి విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జనగామ రాజకీయ పరిస్థితులపై కొమ్మూరితో కాసేపు చర్చించారు. కలిసిన వారిలో పీసీసీ మెంబర్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ వేమల్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, బాలకిషన్‌గౌడ్, శివరాజ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కురుమ సంఘం అధ్యక్షుడిగా గుంటి మల్లయ్య

చిలుపూర్, జనవరి 7: మండలంలోని చిన్నపెండ్యాల కురుమ సంఘం అధ్యక్షుడిగా గుంటి మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సొసైటీ భవనంలో నిర్వహించిన ఎన్నికల కార్యక్రమానికి జిల్లా సహకార ఎన్నికల అధికారి శ్రవన్‌కుమార్ పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులంతా కలిసి గుంటి మల్లయ్యను సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దూడల కుమార్, కార్యదర్శిగా బుల్లె రాజయ్య, కోశాధికారిగా కొన్నె లింగయ్యతో పాటు, సభ్యులుగా మరో నలుగురిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కొన్నె వెంకటయ్య, బెల్లం మహేశ్, దూడల చిన్న అయిలయ్య, బాల కొమురయ్య, మీస కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య

పాలకుర్తి, జనవరి 7 : దివ్యాంగుల సమితి జిల్లా ఉపాధ్యక్షుడిగా పాలకుర్తి మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన మంద ఎల్లయ్యను ఆదివారం నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వడిగం అంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు చేయూతనందించాలని కోరారు. తన నియామకానికి సహకరించిన ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ నయీమ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

జీటీఏ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ సిటీ, జనవరి 7: ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం(జీటీఏ) రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం హైదరాబాద్ మౌలాలిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చెన్నూరి వెంకట విక్రమాదిత్య ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర అధ్యక్షుడిగా కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మేరోజు బ్రహ్మచారి, గౌరవాధ్యక్షుడిగా విశ్వనాథం గుప్త, అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్లపెల్లి ప్రకాశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా అద్దంకి బుచ్చిరాములు, కోశాధికారిగా సపావట్ నర్సింహా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సక్రునాయక్‌లను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాంబరాజు కుటుంబానికి సాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చిలుపూర్, జనవరి 7 : మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారి పడి మృతిచెందిన జగిత్యాల సాంబరాజు (32) కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ పిట్టల మహేందర్ ఆదివారం వేర్వేరుగా సందర్శించారు. సాంబరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సర్పంచ్ రాజ్‌కుమార్ రూ 30 వేలు, ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, ఇతర మిత్రులు కలిసి మరో రూ 26 వేల నగదును వారికి సాయంగా అందజేశారు. ఆయన వెంట గౌడసంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మాచర్ల స్వామి, చందర్, ఎలిశాల యాదగిరి, గుర్రాల రాజేంద్రప్రసాద్, ప్రసాద్, లింగయ్య, దయాకర్, నరేష్, రామకృష్ణ, మోహన్‌రెడ్డి, కలకోల రజనీకుమార్, నారగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లగుట్టలో శ్రీధర్ రావు పరామర్శ..

మండలంలోని పల్లగుట్టలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన గొడుగు రమేష్ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, చిలుపూర్ ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు ఆదివారం సందర్శించారు. మృతదేహం వద్మద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ 10 వేలు అందజేశారు. భవిష్యత్తులోనూ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఎనగందుల రత్నాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చల్లారపు శ్యామ్‌సుందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బత్తిని శ్రీను ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంగళరావు (ఫైల్)

కొడకండ్ల, జనవరి 7: మండలంలోని రామన్నగూడెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంగళరావు (48) మృతి చెందారు. ఎస్ఐ శ్రవణ్ కుమార్ కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు పుప్పాలి వెంగళరావు మొండ్రాయిలోని తన స్నేహితున్ని కలిసి మధ్యాహ్నం బైక్‌పై తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన బండరాయికి ఢీకొట్టి ఎగిరిపడ్డాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఎస్ఐ శ్రవణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సంక్రాంతి పండుగ తర్వాత కూతురు పైచదువుల కోసం అమెరికా వెళ్లాల్సిన ఈ నేపథ్యంలో ఆయన మృతి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గురుకులాల్లో ఐదో తరగతికి ప్రవేశాలు

జనగామ టౌన్, జనవరి 7: జిల్లాలోని గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి కనగాల శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్.ఏసీ.ఇన్, టీజీగురుకులమ్.తెలంగాణ.ఐగావ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 11న జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 1800 4254 5678 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

జనగామ టౌన్, జనవరి 7: వారానికోసారి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేడు(సోమవారం) రద్దు చేసినట్లు కలెక్టర్ శివలింగయ్య ప్రకటించారు. ప్రజా పరిపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అర్జీదారులెవరూ కార్యాలయానికి రావొద్దని కలెక్టర్ సూచించారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

లింగాలఘణపురం, జనవరి7: లింగాలఘణపురం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆదివారం జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవిన్యూ) సుహాసిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆన్‌లైన్ క్రోడీకరణను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట తహసిల్దార్ వినయలత, ఎంపీడీవో సురేందర్‌నాయక్, ఎంపీవో మల్లికార్జున్ ఉన్నారు.

రెడ్డి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

జనగామ టౌన్, జనవరి 7: రెడ్డి సంఘం శామీర్‌పేట గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆవునూరి మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చాడగొండ రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చాడగొండ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అన్‌రెడ్డి జనార్థన్‌రెడ్డి, కోశాధికారిగా కాంసాని భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ భవన్ నిర్మాణం చేపట్టాలని నూతన కమిటీ తీర్మానం చేసింది.

తరిగొప్పులలో పోలీస్ కళాజాత

తరిగొప్పుల, జనవరి 7: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నర్మెట సీఐ సాయిరమణ అన్నారు. తరిగొప్పుల ఎస్సై దూదిమెట్ల నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై పోలీస్ కళాబృందం ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దామెర ప్రభుదాస్, ఎంపీటీసీలు చెన్నూరి ప్రమీల, అర్జుల మధుసూదన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.